సాక్షి
కుమురం భీం

బుధవారం ׀ 15 ׀ ఫిబ్రవరి ׀ 2023

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే కోనప్ప



ఆసిఫాబాద్‌: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడేను సిర్పూర్‌ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఐటీడీఏ పీవోగా వచ్చేదెవరో?

ఐటీడీఏ పీవోగా ఎవరు వస్తారోననే ఉత్కంఠ ఏజెన్సీ ప్రాంతాల్లో నెలకొంది. ప్రస్తుతం ఇన్‌చార్జీగా వరుణ్‌రెడ్డి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2/15.2

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రత తగ్గుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్‌

జాతర పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌, సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: రెబ్బెన మండలం నంబాల గ్రామంలోని శ్రీప్రసన్న పరమేశ్వరాలయంలో ఈ నెల 17 నుంచి మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే జాతరకు హాజరు కావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌ మంగళవారం కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాతరకు సంబంధించిన పోస్టర్‌ ఆవిష్కరించారు. జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని కలెక్టర్‌ తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫాక్స్‌ చైర్మన్‌ కార్నాథం సంజీవ్‌, నంబాల సర్పంచ్‌ సోమశేఖర్‌, ఆలయ కమిటీ చైర్మన్‌ రంగు మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమానికి ఉపాధి పునరావాస పథకం

ఆసిఫాబాద్‌అర్బన్‌: ట్రాన్స్‌జెండర్లు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధి కింద యూనిట్ల మంజూరు కోసం వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమశాఖ ద్వారా ప్రభుత్వం ఉపాధి పునరావాస పథకం అమలు చేస్తోందని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ట్రాన్స్‌జెండర్లు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలు, సేవా రంగంలో వ్యాపారాలు నిర్వహిస్తూ స్థిరమైన ఆదాయంతో సాధారణ జీవితం గడపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ పథకం కింద జిల్లాకు రెండు యూనిట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే వారు కలెక్టర్‌ జారీ చేసిన గుర్తింపు కార్డు, కాంపిటెంట్‌ అథారిటీ జారీ చేసిన ట్రాన్స్‌జెండర్‌ సర్టిఫికెట్‌ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 23లోగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.


వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఐకేపీ వీఓఏలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో డీఆర్‌డీవో సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్‌ మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలకు సెర్ప్‌ నుంచి వచ్చే గౌరవ వేతన్నాన్ని వెంటనే వీఓ ఖతాలో జమ చేయాలన్నారు. సీసీల జోక్యం లేకుండా చెల్లించాలని డిమాండ్‌ చేశారు. గ్రేడింగ్‌ల పేరుతో వీఓఏల జీతాలను పెండింగ్‌లో ఉంచుతున్న సీసీలపై చర్యలు తీసుకోవాలన్నారు. సెర్ప్‌ ద్వారా సెల్‌ఫోన్లు అందించి, ఆన్‌లైన్‌ పనులు చేయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు చందేకర్‌, జ్యోతి, సునీత, కల్పన, మహేశ్‌, రమ, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌ పట్టణ సీఐగా బుద్దే స్వామి



బుద్దే స్వామి

కాగజ్‌నగర్‌టౌన్‌: మల్టీ జోన్‌ వన్‌లో పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగజ్‌నగర్‌ పట్టణ సీఐగా బుద్దే స్వామిని నియమించారు. కౌటాల సీఐగా పనిచేస్తున్న ఆయనను కాగజ్‌నగర్‌ టౌన్‌ సీఐగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే కాగజ్‌నగర్‌ టౌన్‌ సీఐగా పనిచేస్తున్న కంపా రవీందర్‌ను నార్త్‌ జోన్‌ ఐజీ కార్యాలయానికి అటాచ్‌ చేశారు.

'చలో హైదరాబాద్‌' విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్‌: ఆశవర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 16న నిర్వహించే చలో హైదరాబాద్‌ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముంజం ఆనంద్‌కుమార్‌ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం భట్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కౌసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, పంచశీల, సంధ్య, మంజుల, దేవి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పులి..!



పెద్దపులి మళ్లీ కనిపించింది.. రోడ్డు పక్కన దర్జాగా కూర్చొని ఉన్న వీడియో ప్రస్తుతం జిల్లాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. కాగజ్‌నగర్‌ డివిజన్‌లో ఈ ఘటన కలకలం సృష్టిస్తోంది. వైరల్‌గా మారిన వీడియోలోని ప్రాంతం వేంపల్లి అటవీ ప్రాంతంగా ఆ శాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలో పులుల సంఖ్య పెరుగుతుండడంతో వారు అప్రమత్తమవుతున్నారు.

- కాగజ్‌నగర్‌ డివిజన్‌ పరిధిలో కలకలం సృష్టిస్తున్న కదలికలు
- తాజాగా వేంపల్లి అటవీ ప్రాంతంలో ప్రయాణికులకు కనిపించిన పెద్దపులి
- అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు

కౌటాల/చింతలమానెపల్లి: కాగజ్‌నగర్‌ అటవీ డివిజన్‌ పులులకు నిలయంలా మారింది. ఆయా రేంజ్‌ల పరిధిలో దట్టంగా ఉన్న అటవీప్రాంతాలు, సహజ నీటి వనరులతో కూడిన ఆవాసాలు నివాస యోగ్యంగా మారాయి. కాగజ్‌నగర్‌ అటవీ డివిజన్‌లోని పెంచికల్‌పేట్‌, ఖర్జెల్లి, సిర్పూర్‌(టి), బెజ్జూర్‌, కాగజ్‌నగర్‌ రేంజ్‌లలో పులుల కదలికలు నమోదవుతున్నాయి. గతంలో కాగజ్‌నగర్‌ రేంజ్‌ పరిధిలోని కడంబా అటవీ ప్రాంతంలో పులి పిల్లలతో ఉన్న చిత్రం అటవీశాఖ ఏర్పాటు చేసిన కెమెరాలకు చిక్కింది. దీంతో కాగజ్‌నగర్‌ డివిజన్‌లో పులులు నివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయనే విషయం బయటకు తెలిసింది. ప్రస్తుతం వీటి సంతతి వేగంగా వృద్ధి చెందుతోంది.

పక్కనే మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ దట్టమైన అడవులు

కాగజ్‌నగర్‌ అటవీ డివిజన్‌ను ఆనుకుని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రాల అడవులు ఉన్నాయి. కాగజ్‌నగర్‌, సిర్పూర్‌(టి) రేంజ్‌లకు పక్కనే చంద్రాపూర్‌ జిల్లా తాడోబా పులుల అభయారణ్యం పరిధిలోని అటవీ ప్రాంతాలు ఉన్నాయి. ఖర్జెల్లి, పెంచికల్‌పేట్‌, బెజ్జూర్‌ రేంజ్‌లను ఆనుకుని భామ్రాగఢ్‌, ఆల్లపల్లి, సిరొంచా అటవీ ప్రాంతాలు ఉన్నాయి. కాగజ్‌నగర్‌ డివిజన్‌ పరిధిలో పెన్‌గంగ, పెద్దవాగు(బీబ్రానది) ప్రవహిస్తుండగా, మహారాష్ట్ర అటవీప్రాంతంలో ఇంద్రావతి నది ముఖ్యమైంది. దట్టమైన ఈ అడవులు ప్రాణహిత, ఇంద్రావతి పరీవాహక ప్రాంతంలో ఉన్నాయి. ఇక్కడ సహజ నీటి ఊటలు, గడ్డి మైదానాలు విస్తారంగా ఉన్నాయి. సహజ వనరులతో ఏర్పడిన ఈ అటవీ ప్రాంతం పులులకు ఏళ్లుగా ఆవాసంగా ఉంటుంది.

పెరుగుతున్న పులుల సంతతి..

కాగజ్‌నగర్‌ అటవీ డివిజన్‌లో సుమారు 20కి పైగా పులుల కదలికలు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. కాగజ్‌నగర్‌లోని అంకుసాపూర్‌, కడంబా, సిర్పూర్‌ మండలంలోని మాలిని, పెంచికల్‌పేట్‌ మండలంలోని అగర్‌గూడ, కమ్మర్‌గాం, లోడ్‌పెల్లి, బెజ్జూర్‌ మండలంలోని సిద్దాపూర్‌, పాపన్‌పేట్‌, చింతలమానెపల్లి మండలంలోని శివపెల్లి అటవీప్రాంతాలను పులులు ఆవాసంగా మార్చుకున్నాయి. అనువైన వాతావరణం ఉండటంతో ఇక్కడే తమ సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. మహారాష్ట్రలోని అటవీ ప్రాంతాలను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, వాహనాల రద్దీతో పులులు కాగజ్‌నగర్‌ డివిజన్‌ వైపు వస్తున్నాయి. 15 ఏళ్ల క్రితం అడపాదడపా వచ్చిన పులులు క్రమంగా సంతతిని పెంచుకున్నాయి. 10 నుంచి 12 పులులు ఇక్కడ తిరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. అంకుసాపూర్‌ సమీపంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి ఒక ఈతలో 3, మరో ఈతలో నాలుగు పిల్లలకు జన్మనివ్వడం గమనార్హం. అడ ప్రాజెక్టు కాలువ నిర్మాణంతో నీళ్లు పుష్కలంగా ఉండటంతో పులి అక్కడ శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు.

కొత్త పులా.. ఇక్కడిదేనా..?

తాజాగా కాగజ్‌నగర్‌ నుంచి సిర్పూర్‌(టి) మార్గంలో రైల్వేగేటు సమీపంలో కనిపించిన పెద్దపులి కొత్తది కాకపోవచ్చని తెలుస్తోంది. ఇక్కడ ఉన్న పులులు అన్నింటిని పూర్తిస్థాయిలో ఇప్పటివరకు అధికారులు గుర్తించలేదు. వేంపల్లి సమీపంలో కనిపించిన పెద్దపులి అటవీశాఖ అధికారులు అడవుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఇంతకు ముందు చిక్కలేదు. దీంతో మహారాష్ట్ర నుంచి కొత్త పులిగా కూడా అనుమానాలు ఉన్నాయి. ఇక్కడ అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్నా పెద్దపులే కావొచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. గతంలో మహారాష్ట్ర నుంచి వచ్చి వాంకిడిలో ఒక వ్యక్తిపై దాడి చేసి హతమార్చిన పులిని అటవీఅధికారులు నిత్యం ట్రాకింగ్‌ చేస్తున్నారు. ఆ పులి కాగజ్‌నగర్‌ డివిజన్‌ దాటిన అనంతరం అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తాజాగా కనిపించిన పులి అంకుసాపూర్‌ సమీపంలో సంచరిస్తున్న పులిగా అధికారులు అనుమానిస్తున్నారు. కెమెరా చిత్రాల ద్వారా పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పులుల సంచారం ఉన్న నేపథ్యంలో రాత్రి సమయంలో అటవీ ప్రాంతాల గుండా ప్రయాణించే వారు అడవుల్లో ఆగొద్దని అధికారులు సూచిస్తున్నారు.

అపోహలు వద్దు

పులులపై ఎలాంటి అపోహలు వద్దు. సహజంగా అవి ప్రతి జీవిని గుర్తిస్తాయి. ప్రజలు భయాందోళనలకు గురి కాకుండా ఉండాలి. పులులు వాటి సహజ వాతావరణంలో తిరుగుతుంటాయి. అడవుల్లోకి వెళ్లి వాటిని ఇబ్బంది పెట్టవద్దు. పులులు కనిపించిన సందర్భంలో జాగ్రత్తగా ఉండాలి. అటవీ సమీప ప్రాంతాల్లో ఉండేవారికి తరచూ అవగాహన కల్పిస్తున్నాం.

– వేణుగోపాల్‌, రేంజ్‌ అటవీ అధికారి, కాగజ్‌నగర్‌

అంతర్గత రహదారులు పూర్తిచేయాలి

- కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే

ఆసిఫాబాద్‌: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అంతర్గత రహదారుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌తో కలిసి పంచాయతీరాజ్‌ ఈఈలు, డీఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మంజూరైన సీసీరోడ్ల పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల పురోగతి వివరాలు, ఫొటోలు ఎప్పటికప్పుడు పంపించాలన్నారు. ఎస్టీ హ్యాబిటేషన్‌ గ్రామ పంచాయతీ కార్యాలయాల కోసం స్థలాన్ని గుర్తించి పనులు ప్రారంభించాలని సూచించారు. మంజూరైన నిర్మాణ పనులకు ఇసుక అవసరం కోసం సమాచారం ఇస్తే, సంబంధిత తహసీల్దార్‌తో మాట్లాడి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీసీరోడ్ల పనులను ఎఫ్‌టీవో మంజూరు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. నిర్మాణ పనులు పెండింగ్‌ లేకుండా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్‌ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్‌ ఈఈ రామ్మోహన్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖలు కీలకం

ఆసిఫాబాద్‌: రైతుల ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖలు ఎంతో కీలకమని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌ రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, ఉద్యానవన శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఆయిల్‌పామ్‌ విస్తరణ పనులపై సమీక్షించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ, ఉద్యానవన శాఖలు గుండె లాంటివన్నారు. రైతు వేదికల్లో వారానికి ఒకసారి రెండు శాఖల అధికారులు సమావేశం ఏర్పాటు చేసుకుని, సమావేశపు అంశాలను వాట్సప్‌ గ్రూపు ద్వారా పంపించాలని ఆదేశించారు. కార్యాలయ పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు క్షేత్రస్థాయిలో పనులు పూర్తి చేసి, క్లస్టర్లవారీగా సమావేశాలు నిర్వహించాలన్నారు. ఆయిల్‌పామ్‌ సాగు చేస్తున్న, చేయని మండలాల వివరాలతో నివేదిక రూపొందించాలని అన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసరావు, ఉద్యానవన శాఖ ఏడీ వెంకటేశ్‌, వ్యవసాయ విస్తరణ అధికారులు, హార్టికల్చర్‌ అధికారులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌ పకడ్బందీగా నిర్వహించాలి

- డీఐఈవో శ్రీధర్‌ సుమన్‌
- ఎగ్జామినర్లకు 'జూమ్‌' ద్వారా అవగాహన
- నేటి నుంచి ఇంటర్‌ ప్రయోగ పరీక్షలు



ఎగ్జామినర్లకు అవగాహన కల్పిస్తున్న డీఐఈవో

ఆసిఫాబాద్‌అర్బన్‌: బోర్డు నిబంధనల ప్రకారం జిల్లాలో ఇంటర్‌ ప్రాక్టికల్‌ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి శ్రీధర్‌ సుమన్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయం నుంచి పరీక్ష నిర్వహణపై ఎగ్జామినర్లకు మంగళవారం జూమ్‌ మీటింగ్‌ ద్వారా అవగాహన కల్పించారు. బోర్డు నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జనరల్‌, ఒకేషనల్‌ సబ్జెక్టుల అధ్యాపకులు ప్రయోగ పరీక్షలకు ఒక సెషన్‌ ముందే కేంద్రాలకు చేరుకుని ల్యాబ్‌లను పరిశీలించాలని సూచించారు. ప్రయోగాలు నిర్వహించేందుకు అనువైన వసతులు ఉన్నాయో.. లేదో గమనించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 23 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. పరీక్షకు 30 నిమిషాల ముందు ఓటీపీతో ప్రశ్నపత్రం ప్రింట్‌ తీసుకోవాలని సూచించారు. ఇంటర్‌ బోర్డు నిబంధనల ప్రకారం మార్కులు వెంటనే నమోదు చేయాలన్నారు. జనరల్‌ విద్యార్థులు 2,713, ఒకేషనల్‌లో 1,463 మంది మొత్తం 4,176 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు నైతం శంకర్‌, తిరుపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశసేవలో ప్రాణాలర్పించడం గొప్ప త్యాగం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- అమరుడైన ఆర్మీ జవాన్‌ కుటుంబానికి రూ.25లక్షల చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్‌: దేశ సేవలో ఆర్మీ జవాన్‌లు ప్రాణాలర్పించడం గొప్పత్యాగమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. విధి నిర్వహణలో అమరుడైన కాగజ్‌నగర్‌ పట్టణానికి చెందిన ఆర్మీ జవాన్‌ షాకీర్‌ హుస్సేన్‌ కుటుంబానికి మంగళవారం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25లక్షల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం శాంతియుత జీవితాన్ని గడుపుతున్నామంటే దానికి ఇండియన్‌ ఆర్మీ కారణమన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కుటుంబాన్ని వదిలి, గడ్డకట్టే చలిలో నిరంతరం మన దేశాన్ని కాపాడే వీరుల గురించి ఎంత చెప్పినా తక్కువేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కాసం శ్రీనివాస్‌, మున్సిపల్‌ చైర్మన్‌ సద్దాం హుస్సేన్‌, వైస్‌ చైర్మన్‌ రాచకొండ గిరీశ్‌కుమార్‌, కౌన్సిలర్లు, రిటైర్డ్‌ ఆర్మీ జవాన్లు, బీఆర్‌ఎస్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో నాణ్యత పాటించాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్‌



మెడల్‌ అందజేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్‌

ఆసిఫాబాద్‌అర్బన్‌: కేసుల దర్యాప్తులో పోలీసులు మరింత నాణ్యత పాటించాలని ఎస్పీ సురేశ్‌కుమార్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌ హెడ్‌క్వార్టర్‌లో మంగళవారం జిల్లా అధికారులతో నెలవారీ నేర సమీక్ష, పెండింగ్‌ కేసులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీలు, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. కేసుల సత్వర పరిష్కారానికి నిరంతరం న్యాయాధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సైబర్‌ నేరాల్లో వేగంగా పరిశోధన పూర్తిచేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ నెల 11న జరిగిన లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసుల రాజీకి కృషి చేసి మొదటి స్థానంలో నిలిచిన కాగజ్‌నగర్‌టౌన్‌, రెండోస్థానంలో నిలిచిన రెబ్బెన పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు చంద్రశేఖర్‌, భూమేశ్‌లకు క్యాష్‌ రివార్డు అందించి అభినందించారు. వజ్రోత్సవాల్లో భాగంగా పలువురు పోలీసు అధికారులకు మెడల్స్‌ ప్రదానం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్‌) అచ్చేశ్వర్‌రావు, అదనపు ఎస్పీ(ఏఆర్‌) భీంరావ్‌, డీఎస్పీ శ్రీనివాస్‌, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

అమర వీరులకు నివాళి



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌: ఉగ్రవాదుల దాడిలో అమరులైన పుల్వామా వీర జవాన్లకు మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నివాళులర్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్‌ మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న పాకిస్తాన్‌ ఉగ్రవాదులు బాంబు దాడికి పాల్పడి మన సైనికులను హతమార్చడం దేశానికి చీకటి రోజన్నారు. జవాన్ల త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. జవాన్ల త్యాగాలకు దేశం రుణపడి ఉంటుందన్నారు. వీర జవాన్ల స్ఫూర్తి కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఈదులవాడ గణేశ్‌, బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్‌, నాయకులు రాజేశ్‌, తిరుపతి, గుండ ప్రమోద్‌, వేణుగోపాల్‌, నాగరాజు, తన్నీరు రాజు, సదన్న, సంతోష్‌, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

'అధిక సాంద్రత' సాగు సక్సెస్‌

- మొదటి ప్రయత్నంలో విజయం సాధించిన పత్తి రైతులు
- రెట్టింపు దిగుబడి రావడంతో సాగు విధానంపై నమ్మకం
- వచ్చే సీజన్‌లో రెండు వేల ఎకరాలకు పెంచే యోచనలో వ్యవసాయశాఖ



గంగాపూర్‌లో అధిక సాంద్రత విధానంలో సాగుచేసిన పత్తిని పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు(ఫైల్‌)

రెబ్బెన(ఆసిఫాబాద్‌): సంప్రదాయ పద్ధతిలో పత్తి సాగుకు స్వస్తి పలుకుతూ ప్రయోగాత్మకంగా జిల్లాలోని మూడు మండలాల్లో పైలెట్‌ ప్రాజెక్టుగా సాగు చేసిన అధిక సాంద్రత పత్తి సాగు విధానం సక్సెస్‌ అయింది. సాధారణ పద్ధతిలో సాగు చేసిన పంటతో పోల్చితే అధిక దిగుబడి రావటంతో రైతులతోపాటు వ్యవసాయ శాఖ అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలతో దిగుబడి కాస్త తగ్గినా గతంలో పోల్చితే ఈ విధానంలో పత్తి దిగుబడి పెరిగిందని అన్నదాతలు సంబురపడుతున్నారు. గతేడాది వర్షాకాలంలో పైలెట్‌ ప్రాజెక్టు కింద మూడు మండలాల్లో మాత్రమే హెచ్‌డీపీఎస్‌(హై డెన్సిటీ ప్లాంటింగ్‌ సిస్టం) పత్తి సాగును చేపట్టగా, రానున్న వర్షాకాలంలో రైతుల ఆసక్తికి అనుగుణంగా సాగు విస్తీర్ణం పెంచాలని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు.

రెట్టింపు దిగుబడి

జిల్లాలోని రైతులు సాగు చేసే పంటల్లో పత్తిదే అగ్రస్థానం. ఏటా 3.50లక్షలకు పైగా ఎకరాల్లో పత్తినే సాగు చేస్తుంటారు. అలాంటి పత్తి సాగులో ఏటా పెట్టుబడులు పెరిగి తడిచి మోపెడవుతున్నాయి. ఒకే పద్ధతిలో పంటల సాగుతో తెగుళ్ల బెడద అధికమవుతోంది. గులాబీ రంగు పురుగు తీవ్రంగా నష్టపరుస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధిక సాంద్రత పత్తి సాగుకు మొదటి సారిగా జిల్లాలో శ్రీకారం చుట్టారు. ప్రధానంగా గులాబీ రంగు పురుగును నివారించటంతోపాటు ఒకేసారి పత్తి తీసే విధంగా ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలోని మూడు మండలాల్లో 500 ఎకరాల్లో ఈ తరహా పత్తి సాగును చేపట్టారు. ప్రారంభించిన మొదటి ఏడాదే రెట్టింపు దిగుబడి సాధించి సక్సెస్‌గా నిలిచారు. సాధారణ పద్ధతిలో సాగుచేసే పత్తి ఎకరానికి జిల్లా సగటు దిగుబడి 5 నుంచి 6 క్వింటాళ్లు మాత్రమే. అలాంటిది అధిక సాంద్రత విధానంలో రైతులు ఎకరానికి 12 క్వింటాళ్ల వరకు దిగుబడిని సాధించారు.

రెండు వేల ఎకరాలకు పెంచే యోచన

అధిక సాంద్రత పత్తి సాగుతో మొదటి ప్రయత్నంలోనే విజయాన్ని సొంతం చేసుకున్న వ్యవసాయ శాఖ వచ్చే వర్షాకాలంలో జిల్లాలో రెండు వేల ఎకరాల్లో ఈ విధానంలో సాగును పెంచేలా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఈ పద్ధతిలో సాగు చేసిన పంటల క్షేత్ర పర్యటనల ద్వారా మిగిలిన రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. లాభాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలను రైతులకు వివరిస్తూ సాగు విస్తీర్ణం పెంచాలని భావిస్తున్నారు. ఈ తరహా పద్ధతిని పాటించే వారికి సరిపడా పత్తి విత్తనాలను ఉచితంగా అందజేయడంతోపాటు ప్రోత్సాహంగా ఎకరానికి రూ.4వేల చొప్పున నగదు ప్రకటించారు. గతేడాది జిల్లాలో కురిసిన అధిక వర్షాలతో సాధారణ పత్తి సాగుతో పాటు అధిక సాంద్రత పత్తి సాగులోనూ దిగుబడి గణనీయంగా తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే 'హెచ్‌డీపీఎస్‌' పత్తి ఎకరానికి గరిష్టంగా 15 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించవచ్చని అంటున్నారు. మూడు దఫాలు కాకుండా ఒకేసారి పంట మొత్తం చేతికి అందుతుంది. ఆ తర్వాత మరో పంటను సాగు చేసుకునేందుకు సైతం వీలుంటుంది.

మంచి ఫలితాలు సాధించాం



మొదటి ప్రయత్నంలోనే అధిక సాంద్రత పత్తి సాగులో మంచి ఫలితాలు సాధించాం. అధిక వర్షాలతో దిగుబడి అనుకున్నంత మేర సాధించలేకపోయాం. అయితే సాధారణ పద్ధతిలో పత్తి సాగుతో పోల్చితే అధిక సాంద్రత పత్తి సాగుతో రెట్టింపు దిగుబడి వచ్చింది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే దిగుబడి మరింత పెరిగేది. ఇదే ఉత్సాహంతో వచ్చే వర్షాకాలం మరిన్ని మండలాల్లో ఈ పద్ధతిలో పత్తి సాగుకు రైతులను ప్రోత్సహిస్తాం.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

కంటి వెలుగు @51,657

- కొనసాగుతున్న కంటి వైద్యశిబిరాలు



కంటిపరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్‌)

ఆసిఫాబాద్‌: రెండో విడత కంటివెలుగు కార్యక్రమంలో జిల్లాలో కంటి పరీక్షలు నిర్వహించిన వారి సంఖ్య 50 వేలు దాటింది. శిబిరాల్లో అన్నివర్గాల ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు, మందులు అందజేస్తున్నారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన 5,67,718 మందికి పరీక్షలు నిర్వహించాలనేది లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 51,657మందికి పరీక్షలు చేశారు. అవసరమున్న 7,578 మందికి రీడింగ్‌ గ్లాసులు, 6,891 మందికి ప్రిస్క్రిప్షన్‌ గ్లాసుల కోసం ఆర్డర్‌ చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇప్పటికే వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేశారు. కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.

జిల్లాలో 28 బృందాలు

కంటి వెలుగును పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 28 బృందాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని 335 గ్రామపంచాయతీలతో పాటు కాగజ్‌నగర్‌ మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తొలివిడత కార్యక్రమం 2018 ఆగస్టు 15 నుంచి 2019 జనవరి వరకు నిర్వహించారు. 1,98,888 మందికి పరీక్షలు నిర్వహించి 42,396 మందికి అద్దాలు అందజేశారు. తొలివిడతలో ఆరునెలల పాటు కార్యక్రమం కొనసాగింది. రెండో విడత కార్యక్రమం జూలై వరకు కొనసాగనుంది.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో 51,657 మందికి కంటి పరీక్షలు నిర్వహించాం. కంటి వెలుగు లక్ష్యం పూర్తి చేసేందుకు ఈ ఏడాది జూలై వరకు శిబిరాలు కొనసాగిస్తాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్‌ ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తాంసి: మద్యం మత్తులో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వామన్‌నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేస్రం సుదర్శన్–నీలాబాయి దంపతులు వ్యవసాయ కూలీలు. వీరి కుమారుడు శ్రీనివాస్(22) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో సోమవారం అర్ధరాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై కేశవ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

దుప్పిని కాపాడిన యువకుడు


దుప్పితో వెంకటేశ్

భీమారం: మంచిర్యాలలో అటవీ డివిజన్ పరిధిలోని పోలంపల్లి గ్రామ సమీపంలో కుక్కల దాడి నుంచి మంగళవారం చుక్కల దుప్పిని సుందిళ్ల వెంకటేష్ కాపాడాడు. తాగునీటి కోసం అడవి నుంచి బయటకు వచ్చిన దుప్పిని కుక్కలు వెంబడిస్తూ పరుగెత్తించాయి. దుప్పి అనాథాశ్రమం గోడ వద్ద ఆగి ఉండగా గమనించిన వెంకటేష్ రక్షించాడు. అటవీ శాఖ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. స్వల్పంగా గాయపడ్డ దుప్పికి చికిత్స చేసి అడవిలో వదిలేశారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా

- డ్రైవర్‌తో పాటు మరొకరికి స్వల్ప గాయాలు


గాయపడిన డ్రైవర్ లక్ష్మణ్

బెజ్జూర్(సిర్పూర్): బెజ్జూర్ మండలం కుశ్నపల్లి వద్ద మంగళవారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన పెద్దల శంకర్‌కు చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ మెర్పల్లి లక్ష్మణ్ బెజ్జూర్ నుంచి కుశ్నపల్లి వైపు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో గోల్కొండ సమీపంలో ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తోపాటు ట్రాక్టర్‌పై ఉన్న టేకం పులయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వృద్ధుడి ఆత్మహత్య


పోశం మృతదేహం

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్ గ్రామానికి చెందిన వడ్నాల పోశం(80) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పోశం కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం నొప్పి తీవ్రం కావడంతో భరించలేక పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం చనిపోయాడు. పెద్ద కుమారుడు సర్వోత్తం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఐటీడీఏ పీవోగా వచ్చేదెవరో?

- వరుణ్‌రెడ్డి బదిలీతో ప్రాజెక్టు ఆఫీసర్ పోస్టు ఖాళీ
- ప్రచారంలో వరుణ్‌రెడ్డి సతీమణి పేరు
- మరో కీలక అధికారి సైతం జోరుగా పైరవీ?


ఐటీడీఏ కార్యాలయం

ఉట్నూర్: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థకు ప్రాజెక్టు అధికారిగా ఎవరు వస్తారోననే ఉత్కంఠ ఏజెన్సీలో నెలకొంది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఐటీడీఏ పీవోగా విధులు నిర్వహిస్తున్న వరుణ్‌రెడ్డిని నిర్మల్ కలెక్టర్‌గా నియమించిన విషయం విదితమే. ఐటీడీఏకు ప్రాజెక్టు అధికారిగా ఎవరినీ నియమించకపోవడంతో ప్రస్తుతం ఇన్‌చార్జీగా వరుణ్‌రెడ్డి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అయితే పీవోగా వరుణ్‌రెడ్డి సతీమణి, కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ వస్తారని ప్రచారం ఉంది. అలాగే ఐటీడీఏలో కీలక పోస్టులో కొనసాగుతున్న ఓ అధికారి సైతం ప్రాజెక్టు అధికారిగా వచ్చేందుకు జోరుగా పైరవీ చేస్తున్నట్లు సమాచారం.

ఐటీడీఏనే కీలకం...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి ఉట్నూర్ ఐటీడీఏనే కేంద్ర స్థానం. ఐటీడీఏ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని 38 మండలాలు ఉన్నాయి. ఇందులో ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాలు పూర్తిస్థాయి ఏజెన్సీ మండలాలు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న 4.95 లక్షల ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా పలు కార్యక్రమాలు చేపడుతోంది. అయితే కొంతకాలంగా ఐటీడీఏకు పీవోగా వస్తున్న అధికారులు కనీసం రెండేళ్లు గడవకుండానే బదిలీపై వెళ్తుండడంతో పాలన గాడి తప్పుతుందనే ఆరోపణలున్నాయి.

వరుణ్‌రెడ్డి బదిలీతో...

ఐటీడీఏ పీవోగా వరుణ్‌రెడ్డిని ప్రభుత్వం గతేడాది జూన్ 13న నియమించింది. అయితే జనవరి 31న ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆయనను నిర్మల్ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీడీఏకు కొత్త పీవోగా ఎవరినీ నియమించకపోవడంతో వరుణ్‌రెడ్డికే ఇన్‌చార్జి బాధ్యతలూ అప్పగించింది. ఓవైపు కలెక్టర్‌గా, మరోవైపు పీవోగా ఇన్‌చార్జి బాధ్యతల నేపథ్యంలో ఐటీడీఏ పాలనపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని ఆదివాసీ, గిరిజన నాయకులు అంటున్నారు. పూర్తిస్థాయి పీవోను త్వరగా నియమించాలని వారు కోరుతున్నారు.

ఇద్దరిలో ఎవరో..?

ఓవైపు వరుణ్‌రెడ్డి సతీమణి, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ని ప్రభుత్వం పీవోగా నియమిస్తుందని కొద్ది రోజులుగా ఏజెన్సీలో ప్రచారం సాగుతుంది. మరోవైపు ఐటీడీఏలో కొద్ది నెలల క్రితం కీలక బాధ్యతలు చేపట్టిన ఓ అధికారి సైతం పీవోగా వచ్చేందుకు జోరుగా పైరవీ చేస్తున్నట్లు ప్రచారం ఉంది. సదరు అధికారికి ఉమ్మడి జిల్లాలోని ఓ మాజీ ఎమ్మెల్యే అండదండలున్నట్లు తెలిసింది. ప్రస్తుతం సదరు అధికారికి చెందిన ఫైల్ ప్రభుత్వ పెద్దల వద్ద ఉందని, వారం పది రోజుల్లో ఉత్తర్వులు కూడా వెలువడుతాయని ఐటీడీఏలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఇద్దరిలో ఎవరికైనా పీవోగా బాధ్యతలు అప్పగిస్తుందా.. లేక కొత్తవారిని తీసుకువస్తుందా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

శతశాతం కంటి పరీక్షలు నిర్వహించాలి


శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

నెన్నెల: గ్రామాల్లో వంద శాతం కంటి పరీక్షలు నిర్వహించాలని, అందరికీ సేవలు అందేలా చూడాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు సిబ్బందికి సూచించారు. మండలంలోని చిత్తాపూర్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. 18ఏళ్లు పైబడిన వారందరిని స్క్రీనింగ్ చేసుకునేలా ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు. రోగుల నమోదుతో పాటు పరీక్షల ఏర్పాట్లను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. కంటి వెలుగు శిబిరాల్లో ప్రతి ఒక్కరూ నేత్ర పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ భూమేశ్వర్, మెడికల్ ఆఫీసర్ ఝాన్సీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయం


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పోటీల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చేసి జాతీయ అవార్డు పొందడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పోటీల్లో జిల్లా కేంద్రంలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థిని సాయిలు సాయి, శ్రీవల్లి మహిళలకు ఉపయోగపడే రుతుమిత్ర తయారు చేసి జాతీయ స్థాయి అవార్డు పొందడం సంతోషంగా ఉందని తెలిపారు. కేరళలో నిర్వహించిన దక్షిణ భారత స్థాయి విజ్ఞాన ప్రదర్శనలో గైడ్ ఉపాధ్యాయుడు దేవ రాజయ్య ఆధ్వర్యంలో జాడి జగదీశ్వర్ తయారు చేసిన ఎలక్ట్రికల్ స్పైడర్ క్లీనర్ ద్వితీయ బహుమతి పొందారని, టీచర్ టీఎల్ఎంలో తాండూర్ మండల కాసిపేట మండల ప్రాథమికోన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు గంప శ్రీనివాస్ అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని తెలిపారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో తడి, పొడి చెత్త నిర్వహణ కొనసాగుతున్న కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. చెత్త విభజన–నిర్వహణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, సెక్టోరల్ సమన్వయకర్త చౌదరి, జన్నారం మండల విద్యాధికారి విజయ్‌కుమార్, శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ జోబిన్ పాల్గొన్నారు.

ఓబీ వెలికితీత పెంచాలి


శ్రీరాంపూర్: పరిశీలిస్తున్న అధికారులు

- వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

శ్రీరాంపూర్: ఆర్థిక సంవత్సరం సమీపిస్తున్న తరుణంలో మిగిలిన ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ఓసీపీల్లో ఓబీ వెలికితీత సామర్థ్యం మరింత పెంచాలని కంపెనీ మైనింగ్ అడ్వయిజర్ డీఎన్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించారు. క్వారీ వ్యూపాయింట్ వద్ద ఏరియా జీఎం బి.సంజీవరెడ్డితో కలిసి ఓబీ, బొగ్గు వెలికితీత పనులపై సమీక్షించారు. సాధించాల్సిన ఉత్పత్తిపై చర్చించారు. ఓబీ తీస్తేనే బొగ్గు తీయడం సాధ్యం అవుతుందని, ఓబీ పనులు వేగంగా చేయాలని అన్నారు. ఓసీపీ భూ సేకరణ, డంప్‌యార్డు, కోల్ క్వాలిటీ, మిషనర్ల పనితీరుపై ఆయన ఏరియా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ సుధీర్, సర్వే అధికారి రాంమోహన్, ఓబీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జైపూర్: ఈ ఏడాది వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధిస్తూ రవాణా, ఓబీ లక్ష్యాలను ఛేదించాలని అడ్వయిజర్ మైనింగ్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని ఇందారం ఓపెన్‌కాస్టు గనిని మంగళవారం శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డితో కలిసి సందర్శించారు. ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ వెలికితీత, భూసేకరణ సంబంధిత అంశాలపై సమీక్షించారు. అనంతరం ఓసీపీ వ్యూ పాయింట్ నుంచి పని స్థలాలను పరిశీలించారు. ఇందారం ఓసీపీ గనిలో రోజువారీ ఉత్పత్తి లక్ష్యాలు సాధించడం, రోజువారీ ఓబీ వెలికితిత లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ రవికుమార్, గని ఆపరేషన్ మేనేజర్ బ్రహ్మాజీ, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్ ధర్నాకు తరలిన బీఎంఎస్ నాయకులు



శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. దీనికి బీఎంఎస్ నుంచి ఆ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డిలతో పాటు పలువురు నేతలు హాజరయ్యారు. సింగరేణిని రక్షించుకోవడం కోసం ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని వారు పిలుపునిచ్చారు. బొగ్గు బ్లాకుల వేలంను అడ్డుకోవాలని ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీసం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ నాయకులు పూనం రామకృష్ణ, గోపతి సందీప్‌లు పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు


సర్టిఫికెట్లు అందుకుంటున్న విశ్వేశ్వరశర్మ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల లలితా సేవా సమితి ఆధ్వర్యంలో 108 మందితో 108 గృహాల్లో 108 సార్లు 108 రోజులు లలిత పారాయణం చేసినందుకు ఇంటర్నేషనల్ వండర్‌బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. మంగళవారం మంచిర్యాలలో లలితా సేవా సమితి సభ్యులతోపాటు కార్యక్రమంలో పాల్గొన్న వారి పేర్లతో సర్టిఫికెట్లను సంస్థ స్టేట్ కో–ఆర్డినేటర్ రాంప్రకాశ్ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, సంస్థ నిర్వాహకుడు విశ్వేశ్వర శర్మ, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


ధర్మన్న (ఫైల్)

తానూరు: మండలంలోని హిప్నెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎల్వి గ్రామానికి చెందిన జొరిగల్ ధర్మన్న(52) ద్విచక్ర వాహనంపై ముథోల్ నుంచి ఎల్వికి వెళ్తున్నాడు. హిప్నెల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఇటుకలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ధర్మన్న వెనుక నుంచి ఢీకొని రోడ్డుపై పడ్డారు. హెల్మెట్ లేకపోవడంతో తలకు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ధర్మన్నకు భార్య చంద్రకళ, కూతురు, కుమారుడు

ఎస్సైని గాయపరిచిన యువకుడి అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సైని గాయపర్చిన ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్ సమీపంలో సోమవారం రాత్రి ఎస్సై కలీం డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఖుర్షీద్‌నగర్ కాలనీకి చెందిన సద్దాం అనే యువకుడు ఎస్సైని నెట్టివేయగా గాయాల పాలయ్యారు. మద్యం మత్తులో యువకుడు దురుసుగా ప్రవర్తించడంతోనే ఎస్సైకి గాయాలైనట్లు తెలిపారు. ఈ మేరకు యువకుడిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

సామూహిక హనుమాన్ పారాయణం


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లక్సెట్టిపేట: మండలంలోని కొత్తూరు గ్రామంలో హనుమాన్ ఆలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం 108వ వారం విజయవంతంగా నిర్వహించారు. ప్రతి మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం తొమ్మిది గంటల వరకు భక్తులు పెద్దమొత్తంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ పారాయణంలో భక్తులు పాల్గొని పాటలు పాడుతు, భజనలు చేస్తు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు నాయకులు పాల్గొన్నారు.

'మన బడి' మార్చింది..!


పాఠశాల ఆవరణలో చిన్నారుల ఆట పరికరాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 'మన ఊరు–మన బడి' పథకంలో భాగంగా చేపట్టిన పనులతో ప్రభుత్వ బడి మారింది. కొత్త కొత్తగా దర్శనమిస్తోంది. జిల్లాలో 210 ప్రాథమిక, 96 ప్రాథమికోన్నత, 108 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొదటి విడతగా 245 పాఠశాలల్లో 'మన ఊరు–మన బడి'పనులు చేపట్టారు. రూ.9.05 కోట్లతో పనులు చేపట్టగా ఇందులో పనులు పూర్తయ్యి కొత్త హంగులతో రూపుదిద్దుకున్న 36 ప్రభుత్వ పాఠశాలలను ఫిబ్రవరి 1న ఎమ్మెల్యేలు, కలెక్టర్ ప్రారంభించారు. ఈ పథకంలో ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు కల్పించారు. శిథిల భవనాల స్థానంలో నూతన నిర్మాణాలు, మరమ్మతులు, విద్యుద్దీకరణ పనుల్లో భాగంగా తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి వసతి, నిరంతర నీటి సరఫరాతో మరుగుదొడ్లు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు నూతన ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, డ్యూయల్ డెస్క్‌లు, అల్మారాలు, బోధనా సౌకర్యాలు, పాఠశాలకు రంగులు, ప్రహరీ, వంటగది, ఉన్నత పాఠశాలల్లో భోజన వసతి తదితర సౌకర్యాలు కల్పించారు. పాఠశాలలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో కార్పొరేట్‌కు దీటుగా రూపురేఖలు మారాయి. హాజీపూర్ మండలం సబ్బెపల్లి ప్రాథమిక పాఠశాల కార్పొరేట్‌కు దీటుగా ముస్తాబైంది. రూ.16 లక్షలతో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టారు. స్థానికుడు, మాజీ జెడ్పీటీసీ హరిప్రియ, వినయ్‌ప్రకాశ్‌రావు దంపతులు పాఠశాలకు రూ.5 లక్షల విరాళం అందజేయగా ఆట పరికరాలు, ఆధునిక నీటి ట్యాంకు నిర్మాణ పనులకు ఉపయోగించారు. కొత్తగా మారిన పాఠశాల విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.


డ్యూయల్ బెంచ్‌లపై చదువుతున్న విద్యార్థులు


సబ్బెపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాదానికి గురైన ఆటోను పరిశీలిస్తున్న ఎస్సై భూమేశ్

రెబ్బెన(ఆసిఫాబాద్): తిర్యాణి మండలంలోని కైరిగూడ ఓసీపీ వెళ్లే దారిలో పావురాల గుట్ట సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చోపిడి గ్రామానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. తిర్యాణి మండలం చోపిడి గ్రామానికి చెందిన టేకం మారుతి, టేకం భీంరావు సొంత పని నిమిత్తం గోలేటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో పావురాలగుట్ట సమీపంలోకి రాగానే కైరిగూడ వైపు నుంచి గోలేటి వైపు వెళ్తున్న జేసీబీ ఎదురుగా ఆటోను ఢీకొట్టింది. ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ మారుతి తలకు, వెనుక కూర్చున్న భీంరావ్ ఎడమ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 సిబ్బందితోపాటు రెబ్బెన ఎస్సై భూమేశ్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 ఈఎంటీ శవంత, పైలెట్ సంతోష్ హుటాహుటిన క్షతగాత్రులను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ తీగలు


బూరుగుపల్లి(కే) గ్రామంలో ఓ ఇంటిపై తెగిపడిన 11 కేవీ వైర్లు

నర్సాపూర్(జి): మండలంలోని బూరుగుపల్లి(కె) గ్రామంలో మంగళవారం సాయంత్రం పలువురి ఇళ్లపై హైటెన్షన్(11కేవీ) విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. వెంటనే గ్రామస్తులు సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. గతంలో కూడా రెండుసార్లు 11 కేవీ తీగలు తెగిపడ్డాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో ఇళ్ల పైనుంచి 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని పేర్కొన్నారు. పల్లె ప్రగతిలో ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలు తొలగిస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు తొలగించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఊరంతా విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి 11 కేవీ తీగలను ఇళ్ల పైనుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

గుర్తు తెలియని బాలుడి అప్పగింత


బాలుడితో సీడీపీవో నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్

భైంసాటౌన్: బస్సులో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న ఓ గుర్తుతెలియని బాలుడిని ఐసీడీఎస్ అధికారులు పట్టణంలోని వివేకానంద ఆవాసంలో అప్పగించారు. కుభీర్ సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ అనసూయ మంగళవారం భైంసా నుంచి నిర్మల్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్లింది. తిరిగి భైంసాకు వస్తున్న క్రమంలో ఓ బాలుడు కనిపించడంతో చిరునామా కోసం ఆరా తీసింది. బాలుడు వివరాలు తెలుపకపోవడంతో భైంసాలోని సీడీపీవో కార్యాలయంలో సీడీపీవో నాగలక్ష్మి దృష్టికి తీసుకురాగా, వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాలుడి వివరాలు నమోదు చేయించారు. అనంతరం స్థానిక వివేకానంద ఆవాసంలో అప్పగించారు. బాలుడి కుటుంబీకులు ఎవరైనా ఉంటే సంప్రదించాలని సూచించారు.

జాతీయస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్


కోచ్ రాజుతో సపావత్ రమ్య

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థి సపావత్ రమ్య మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతున్న రెండో ఖేలో ఇండియా జాతీయ మహిళల పోటీల్లో జూడో క్రీడలో స్వర్ణ పతకం సాధించింది. డీవైఎస్వో వెంకటేశ్వర్లు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పార్థసారథి, కోచ్ రాజు అభినందించారు.

పొట్టేలు అపహరణ

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఏనుగుల రాములు విలువైన చోరీ అయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం నుంచి ఏడాది క్రితం రూ.30 వేలకుపైగా వెచ్చించి పొట్టేలును కొనుగోలు చేసి తెచ్చాడు. సోమవారం రాత్రి దొంగలు కొట్టంలోని మంద నుంచి ఆ పొట్టేలును ఎత్తుకెళ్లారు. మంగళవారం పొట్టేలు కనిపించకపోవడంతో ఆందోళన చెందాడు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని పేర్కొన్నాడు. 2017లోనూ తమ కొట్టంలోని ఆరు మేకలు చోరీ అయ్యాయని తెలిపాడు.



పుల్వామా అమరులకు నివాళి

జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడ కాలనీలో పుల్వామా అమరవీరులకు మంగళవారం రాత్రి నివాళులర్పించారు. ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో జోహార్లు అర్పించారు. –నిర్మల్‌టౌన్